స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత సీఎస్ జవహర్‌రెడ్డి, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు

నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

- ఉమ్మడి ఏపీ విశ్రాంత చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి
- అన్మాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్‌లో ముగిసిన స్కూల్ ఎర్త్‌క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం

కడ్తాల్, అక్టోబర్ 24 : నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉన్నదని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఉమ్మడి ఏపీ విశ్రాంత చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గల ఎర్త్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ-కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్' నాలుగవ బ్యాచ్ వారికి నిర్వహించిన అవగాహన కార్యక్రమం గురువారం సాయంత్రం ముగిసింది. రెండు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం, నిజామాబాద్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 80 మంది ప్రభుత్వ పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జవహర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పుడమి అంతా కాలుష్యంతో నిండిపోయిందని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పంటల సాగులో విరివిగా రసాయనాల వాడకంతో భూసారం తగ్గిపోతుందని తెలిపారు. ప్రకృతి, గో ఆధారిత వ్యవసాయంతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ తరపున చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని తెలిపారు.

పర్యావరణవేత్తలు పురుషోత్తంరెడ్డి తదితరులు మాట్లాడుతూ.. చిన్నారులకు విద్యార్థి దశ నుంచే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పర్యావరణాన్ని కాపాడటానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకై విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా వ్యాయామ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పర్యావరణంపై ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయుల బోధనలు ఉండాలని తెలిపారు. నేటి యువత చిన్న చిన్న పనులకు కూడా నడవడంలేదని, శారీరకంగా వ్యాయమాలు చేయడంలేదని తెలిపారు. విద్యార్థుల్లో శారీరక శ్రమ పెంపొందించేలా వ్యాయామ ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ మాట్లాడుతూ.. పుడమిని కాపాడుకోవడానికి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే ధ్యేయంగా సీజీఆర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నామని తెలిపారు. భూమి ప్రాధాన్యతను, మట్టి విలువను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. పాఠశాలల్లో ఔషధ, కూరగాయల మొక్కలను నాటాలని తెలిపారు. పద్నాలుగేండ్లుగా సీజీఆర్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులకు సీజీఆర్ సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లను అందజేశారు. అంతకుముందు ఎర్త్ సెంటర్ ఆవరణలో పర్యావరణవేత్తలతో కలిసి జవహర్‌రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, వందేమాతరం కన్వీనర్ రవీందర్‌రావు, సీజీఆర్ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును గురువారం ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల నాయకులు. - ధారూరు, అక్టోబర్ 24

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- డీఈవో సుశీందర్‌రావు
- కడ్తాల్‌లో అట్టహాసంగా ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

క్రీడాకారులతో డీఈవో సుశీందర్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు

కడ్తాల్, అక్టోబర్ 24 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఫార్చ్యూన్ బట్టర్‌ఫ్లై స్కూల్ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-68వ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో కడ్తాల్, మహేశ్వరం, షాద్‌నగర్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం జోన్‌లకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలురు, బాలికలకు నిర్వహించిన కబడ్డీ పోటీలను సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, సీఐ శివప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డితో కలిసి డీఈవో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులచే ఆయన గౌరవ వందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు, నాయకులు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి, దేహ దారుఢ్యానికి దోహదపడతాయని తెలిపారు. క్రీడలతో స్నేహబంధాలు పెంపొందడంతోపాటు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో బాలుర అండర్-17 విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో సరూర్‌నగర్, షాద్‌నగర్., బాలుర అండర్-14 విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్., బాలికల అండర్-17 విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం., బాలికల అండర్-14 విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం., రాజేంద్రనగర్ జట్లు నిలిచినట్లు జోనల్ కార్యదర్శి భీముడునాయక్ వివరించారు. గెలుపొందిన జట్లకు ప్రజాప్రతినిధులు, అధికారులు ట్రోఫీలతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జంగయ్య, ప్రిన్సిపాల్ సంజీవ్, నాయకులు, జోనల్ కార్యదర్శులు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికలు

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

పరిగి, అక్టోబర్ 24 : కులకచర్ల పర్యటనకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిగి తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డుల స్కానింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. రోజుకు ఎన్ని రికార్డులు స్కాన్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రికార్డును తప్పనిసరిగా స్కాన్ చేయాలన్నారు. సాధ్యమైనంత త్వరగా రికార్డుల స్కానింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు సైకిల్ ర్యాలీ

ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 24 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎస్పీ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 6.30 నుంచి 8.00 గంటల వరకు పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం నుంచి హరిత రిసార్ట్స్ వరకు సైకిల్ ర్యాలీ, 3కే రన్ ఉంటుందని తెలిపారు. 10.30 నుంచి 2 గంటల వరకు పోలీస్ శిక్షణ కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. యువకులు, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పది రూపాయల బిళ్లపై అపోహలు వద్దు

- వాటిని అధికారికంగా వినియోగించవచ్చు
- సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ ధారాసింగ్

సిటీబ్యూరో, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ) : పదిరూపాయల బిళ్లలపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, వాటిని అన్ని లావాదేవీల్లో వినియోగించుకోవచ్చని సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ ధారాసింగ్ అన్నారు. హైదరాబాద్ కోఠిలోని కరెన్సీ చెస్ట్ బ్రాంచ్‌లో కాయిన్ మేళా పేరిట పది రూపాయల నాణేలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌బీఐ విడుదల చేసిన ఈ నాణేలను ఎక్కడైనా వినియోగించుకోవచ్చని, వీటిపై ఎలాంటి నిషేధం లేదన్నారు. నాణేలతో అన్ని రకాల ఆర్థిక లావాదేవీలను నిర్వహించుకోవచ్చన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ కాయిన్ మేళా ఏర్పాటు చేసినట్లుగా సెంట్రల్ బ్యాంక్ రీజనల్ హెడ్ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ కరెన్సీ చెస్ట్ బ్రాంచ్ మేనేజర్ వివేకానంద, ఏజీఎంలూ సత్యవాణి, కనకరాజ్, గుల్షన్ కుమార్‌తోపాటు పలువురు బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

రూ.500 కోసం హత్య! నిందితుడికి జీవితఖైదు

నిందితుడు షేక్ బడే మియా

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 24 : కేవలం రూ.500 కోసం ఓ మహిళను అతిదారుణంగా రాయితో కొట్టి చంపిన కేసులో నిందితుడికి జీవితఖైదు పడింది. ఈమేరకు రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్‌లోని 10వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు గురువారం తీర్పునిచ్చింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ ఇన్స్పెక్టర్ అంజిరెడ్డి కథనం ప్రకారం.. 2021 నవంబర్ 12న పెద్దఅంబర్‌పేట-గండిచెరువు మార్గంలో సర్వీస్ రోడ్డు పక్కన చిన్న వాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్టు ఓ నీటి ట్యాంకర్ డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో అప్పట్లోనే అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా మట్టంపల్లి మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన షేక్ బడే మియా అలియాస్ రఫీ ఈ దారుణానికి ఒడిగట్టినట్టు విచారణలో తేల్చారు. రఫీని అరెస్టు చేసి జుడిషియల్ కస్టడీకి తరలించారు. మద్యం తాగేందుకు రూ.500 కోసమే మహిళ(ఆమె ఆచూకీ ఇప్పటికీ తెలియలేదు)ను రాళ్లతో కొట్టి చంపి, వాగులో పడేసినట్టు సాక్ష్యాలు సేకరించారు. ఈ మేరకు నిందితుడికి జీవితఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ కోర్టు న్యాయమూర్తి హరీశ తీర్పునిచ్చారు. ఇన్వెస్టిగేషన్ అధికారి అప్పటి ఇన్స్పెక్టర్ స్వామి, అడిషనల్ పీపీలు రఘు, శోభారాణి, అబ్దుల్లాపూర్‌మెట్ సిబ్బంది కేసు విచారణకు హాజరయ్యారు. కేసును ఛేదించి, నిందితుడికి శిక్షపడేలా చేసిన పోలీసులను రాచకొండ సీపీ, ఇతర ఉన్నతాధికారులు అభినందించినట్టు ఇన్స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపారు. నిందితుడిపై పలు పోలీస్ స్టేషన్లలో హత్యానేరం కేసులు ఉన్నాయని చెప్పారు.

ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

యాలాల, అక్టోబర్ 24: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ అన్నారు. ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం ఏసీవో సరళ, ఏవోపీ భార్గరి, అంబుడ్స్‌మన్ రాములు, ఎంపీడీవో పుష్పలీల, ఎంపీఈవో యాదయ్య, ఎస్ఆర్‌పీ రవిలతో కలిసి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. క్షేత్రస్థాయి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వద్దని, పొరపాట్లు పునరావృతం కాకుండా సరిదిద్దుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో చేసిన కూలీల పేర్లను హాజరు పట్టికలో ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయకపోవడంతో కూలీలు నష్టపోతారని వారు తెలిపారు.

ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- పంచాయతీ కార్యాలయంలోనే పురుగుల మందు తాగిన వైనం

యాచారం, అక్టోబర్ 24 : ఇంటి ఆన్‌లైన్ ధ్రువపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి ఇవ్వడంలేదని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుల మందు తాగి పంచాయతీ కార్యాలయంలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన ముక్కెరి మధుసూదన్(38) గ్రామంలో నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఉన్న అతడు తన ఇంటిపై బ్యాంకు లోన్ తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. బ్యాంకువారు తన ఇంటికి సంబంధించిన ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాన్ని గ్రామపంచాయతీ ద్వారా తీసుకురావాలని సూచించారు. దీంతో అతడు పంచాయతీ కార్యదర్శిని ఆశ్రయించాడు. డాక్యుమెంట్ ప్రకారం ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని అడుగగా, ఇంటి స్థలం ఆధారంగా నిబంధనల ప్రకారం ఇస్తానని పంచాయతీ కార్యదర్శి బదులిచ్చారు. మొత్తం స్థలం కాకుండా మెట్ల వరకే(సెట్‌బ్యాక్) ఇస్తామని ఆమె చెప్పారు. దీంతో ఇంటి స్థలం తక్కువ రావడంతో.. తనకు డాక్యుమెంట్ ప్రకారం ఇవ్వాలని ఆయన అధికారులతో వాదించాడు. ఇలా ఆరునెలలుగా సర్టిఫికెట్ కోసం పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగాడు.

ఈ క్రమంలో ఇంటిని తన భార్య పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనున్నాడు. తాడోపేడో తేల్చుకోవాలని అతడు నిర్ణయించుకుని.. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయానికి నేరుగా టమాట నారుకు వేసే పురుగుల మందును తీసుకొని వెళ్లాడు. తనకు ఇంటి ఆన్‌లైన్ సర్టిఫికెట్ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని డిమాండ్ చేశాడు. ఇచ్చేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆమెతో వాగ్వాదానికి దిగాడు. సర్టిఫికెట్ ఇస్తవా ఇవ్వవా అంటూ మొండికేశాడు. నిబంధనలు ఉల్లంఘించి ఇవ్వనని కార్యదర్శి తేల్చిచెప్పడంతో చివరకు విసుగుచెందిన మధుసూదన్ తనతో తెచ్చుకున్న పురుగుల మందును అందరూ చూస్తుండగానే తాగాడు. వెంటనే అక్కడున్న స్థానికులు, సిబ్బంది అతడి చేతిలో ఉన్న పురుగుల మందు డబ్బాను తీసుకొని పడేశారు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు యాచారంలోని సీహెచ్‌సీ సెంటర్‌కు తరలించారు. అక్కడ అతడికి వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నగరంలోని గాంధీ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతున్నాడు.

మోత్కూర్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై యువతకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పరిసరాల పరిశుభ్రతకు కృషిచేయాలి

దోమ, అక్టోబర్ 24 : పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా యువజన క్రీడా మంత్రిత్వ శాఖ అధికారి ఐజయ్య అన్నారు. దోమ మండలం మోత్కూర్, దోమ, దిర్సంపల్లి గ్రామపంచాయతీల పరిధిలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్‌పై యువతకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజయ్య మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించేందుకు యువత ముందుకు రావాలని సూచించారు. తడి పొడి చెత్తను వేరు చేయాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న యువతకు మై భారత్ ఈవెంట్ డైరీలు, టోపీలు, పెన్నులను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, ఎంపీవో సోమలింగం, నెహ్రూ యువ కేంద్రం అకౌంటెంట్ సాయికృష్ణ, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీ అభివృద్ధికి కృషి

నూతన వైస్ చాన్స్‌లర్ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 24 : వర్సిటీ నిబంధనలకు అనుగుణంగా పని చేస్తూ, మంచి ఫలితాలు సాధించడానికి అంతా కృషి చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ నూతన వైస్ చాన్స్‌లర్ జానయ్య అన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆడిటోరియంలో ఉద్యోగులు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. తదనుగుణంగానే యూనివర్సిటీలో కొత్త మార్పులు తీసుకురానున్నట్లు తెలిపారు. ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతో జరిగిన సమావేశంలో వర్సిటీలో పరిశోధన, విద్య, విస్తరణలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా జనవరి 2025లోగా వర్సిటీలోని సమస్యలు పరిష్కరించి, ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి తన జన్మహక్కుగా భావిస్తానని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఆయన తెలిపారు.

సాంకేతిక అర్హత లేకపోయినా కొన్ని ప్రైవేట్ సంస్థలు వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టడం విడ్డూరమన్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డు, స్కాలర్స్, పీహెచ్‌డీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలు త్వరలోనే పరిష్కారం కానున్నాయన్నారు. ఈ ఏడాది వర్సిటీ దేశవ్యాప్తంగా 37వ ర్యాంకులో ఉండగా త్వరలో 10 ర్యాంకు వచ్చేలా కృషి చేయాలని వీసీ సూచించారు. గ్రామీణ విద్యార్థులకు వ్యవసాయ విద్యను చేయడానికి రూ.10 లక్షల ఫీజును రూ.5 లక్షలకు తగ్గించి మరో 200 సీట్లు పెంచారని పేర్కొన్నారు. 1964 నుంచి యూనివర్సిటీ కొనసాగుతున్నదని, ఈసారి వజ్రోత్సవం నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. అంతకుముందు టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు.

ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడితే చర్యలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



తుక్కుగూడలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం అక్టోబర్ 24 : ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని తుక్కుగూడలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెల రోజుల్లో నెరవేర్చుతానని చెప్పి.. ఎందుకు నెరవేర్చలేదో సమాధానం చెప్పాలన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి.. ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదన్నారు. రైతు రుణమాఫీ, రైతు బంధు, మహిళలకు ఇస్తానన్న రూ.2500లు ఎప్పుడు ఇస్తారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాల్య వివాహాలను నిర్మూలించడానికే కల్యాణలక్ష్మి పథకాన్ని తీసుకువచ్చిందని, 18 సంవత్సరాలు నిండినవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని చెప్పడంతో చాలా మంది అమ్మాయిలకు 18 ఏండ్లు నిండిన తర్వాత పెండ్లిళ్లు చేస్తున్నారని తెలిపారు. అప్పటి నుంచి అమ్మాయిలు బాగా చదువుకుంటున్నారని సబితారెడ్డి పేర్కొన్నారు.

ఫాక్స్‌కాన్ లాంటి కంపెనీలు రావడంతో తుక్కుగూడ ప్రాంతంలో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతున్నాయన్నారు. రానున్న రోజుల్లో తుక్కుగూడ మరో హైటెక్ సిటీగా మారబోతుందన్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కృషితోనే అనేక కంపెనీలు ఈ ప్రాంతానికి వచ్చాయన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.270 కోట్ల నిధులను నిలిపివేశారని, దీంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయన్నారు. ప్రజల అవసరాల కోసం వైకుంఠధామాలను అభివృద్ధి చేయడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ మధుమోహన్, మహేశ్వరం తహసీల్దార్ సైదులు, వైస్ చైర్మన్ భవాని, కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

7 కోట్లతో రావిర్యాల చెరువు సుందరీకరణ

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక విజన్‌తో చెరువులను అభివృద్ధి చేయించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో ఉన్న రావిర్యాల చెరువును గురువారం ఆమె పరిశీలించారు. చెరువు చుట్టూ తిరిగి సుందరీకరణ పనులను పరిశీలించారు. చెరువు కట్టపై ఇంకా చేయాల్సిన పనుల గురించి అధికారులతో చర్చించి.. సుందరీకరణ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల్లో పూడిక తీయడం జరిగిందన్నారు. చెరువులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లు నిధులు కేటాయించి చెరువు సుందరీకరణ పనులు చేపట్టారన్నారు. గతంలో రావిర్యాల చెరువును సుందరీకరణ చేయడానికి రూ.7 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. గౌడన్నల కోసం చెరువు కట్టపై 700 ఈత చెట్లు నాటించాలన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామ్, ఏఈ శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ రవినాయక్ ఉన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 24: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్ఐ), బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎల్‌డీ), బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ), బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఏఎస్‌డీ) తదితర కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 24: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్సీ తదితర కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫీజుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 24: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ అప్లైడ్ న్యూట్రిషన్ కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 1వ త